సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం, 18, ఆగస్టు, 2025



విష జ్వరంతో విద్యార్థి మృతి

వేంపల్లె పట్టణం శ్రీరాం నగర్ వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి బింగి రఘువరన్ ఆదివారం సాయంత్రం విష జ్వరంతో మృతి చెందాడు. -8లో



రూ.3 కోట్ల స్థలం ఆక్రమణకు యత్నం

తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్ రోడ్ నెం.4లో రూ.3 కోట్ల విలువైన పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.500
రెండోరకం	రూ.200	రూ.370

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 128 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్యకొండకు చేరుతుందన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందన్నారు. భక్తులకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

రాజంపేట టౌన్: హిందీ ప్రచారసభ హైదరాబాద్ వారు నిర్వహించే ప్రథమ, మధ్యమ, ఉత్తమ, విశారత్, భూషణ్, విద్వాన్ పరీక్షలకు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోతరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలు రాసేందుకు అర్హులన్నారు. సెప్టెంబర్ 13, 14వ తేదీల్లో పరీక్షలు ఉంటాయన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు హిందీపండింట్ ట్రైనింగ్ చేసేందుకు, డీఎస్సీ రాసేందుకు అర్హులవుతారన్నారు. మరిన్ని వివరాలకు 6303701314 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 18వ తేదిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని పేర్కొన్నారు.

రెడ్డెమ్మా..దీవించమ్మా



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. భక్తుల అమ్మవారికి ఉదయాన్నే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతానం కోసం వరపడ్డారు.మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. మరికొందరు తలనీలాలు సమర్పించారు. హిందువులతోపాటు ముస్లీమ్‌లు పూజలు నిర్వహించారు. కర్ణాటకా, తమిళనాడు రాష్ట్రాలతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

హాయ్..బ్రోస్.. నాతో ఇంటరాక్ట్ అవుతారా



మిట్స్‌లో అలరించనున్న రియా రోబో

కురబలకోట: మదనపల్లె సమీపంలో అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్శిటీలో సోమవారం మొదటి సంవత్సరం నూతన బీటెక్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చాన్స్‌లర్ నాదెళ్ల విజయ భాస్కర్ చౌదరి తెలిపారు. ఇందుకు రియా అనే హ్యూమనాయిడ్ రోబో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. బెంగళూరు నుండి తీసుకొచ్చారు. రోబో గురించి వినడం చదవడం ఆపై సినిమాల్లో చూడటం తప్ప ఈ ప్రాంత వాసులు ప్రత్యక్షంగా చూడడం ఇదే తొలిసారి. విద్యార్థులకు స్వాగతం పలకడంతో పాటు ముఖా ముఖి నిర్వహించనుంది. అతిథిగా అలరించనుంది. విద్యార్థులతో ఇది ప్రత్యక్ష ఇంటరాక్ట్ చేయనుంది. మిట్స్ క్యాంపస్‌లో నూతన ఉత్సాహాన్ని ఇనుమడింపజేయనుంది. 19న ప్రేరణాత్మక వక్తి యండమూరి వీరేంద్రనాద్ హాజరవుతున్నట్లు తెలిపారు.

అసంపూర్తి.. అసంతృప్తి

కదలని ఇల్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణాలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం
- 2019-24లో 34,906 పూర్తి చేసి రూ.826 కోట్ల వ్యయం
- 2024 జూన్ నుంచి ఇప్పటిదాకా చేసిన ఖర్చు రూ.24 కోట్లే
- చిత్తశుద్ధిలేక ఎక్కడికక్కడే ఆగిపోయిన పనులు



కురబలకోట మండల బ్రాహ్మణ ఒడ్డిపల్లెలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు

మదనపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు మంజూరు చేసిన పక్కా గృహ నిర్మాణాల పూర్తికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదు. జిల్లా స్థాయిలో లక్ష్యాలు ఇస్తూ చేతులు దులుపుకుంటోంది తప్పితే క్షేత్రస్థాయిలో నిర్మాణాలపై కనీస పర్యవేక్షణ లేదు.పనులు త్వరితగతిన పూర్తి చేయించాలన్న లక్ష్యంతో కలెక్టర్ శ్రీధర్ చామకూరి మండలాలు, మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియమించినా వారు పత్తా లేకుండాపోయారు. వీరు మండలాలవైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోవైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల కార్యక్రమం వేగంగా జరిగింది. 1,236 లేఔట్లలో పేదలకు ఇళ్లస్థలాలను కేటాయించి, నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించారు. బోర్లు, విద్యుత్ ఏర్పాటు చేసి ఇసుక అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వం మారడంతో ఇళ్ల నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపింది. పేదల గూడుపై పాలకులకు కనికరం లేకుండాపోతోంది.

నత్త నడకన నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. మూడేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి జిల్లాలో 34,906 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యమో లేక గత ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యమని అలక్ష్యమో కాని పేదల ఇళ్ల నిర్మాణాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 14 నెలల పాలనలో జిల్లాలో వందలోపు నిర్మాణాలు పూర్తయిన మండలాలు నాలుగు ఉన్నాయి. బి.కొత్తకోట పట్టణంలో కేవలం 72, నందలూరులో 88, చిట్వేలిలో 67, ఓబులవారిపల్లెలో 90, పుల్లంపేటలో 56 ఇళ్లను మాత్రమే ఏడాది కాలంలో పూర్తి చేయించారు. ఇవికాక వందమించిన ఇళ్లు ఉండగా అత్యధికంగా పీలేరులో 419 ఇళ్లను పూర్తి చేశారు. ఈ ఇళ్లను పూర్తి చేయించే విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వ పాలనలో పూర్తి చేసినట్టు చెబుతున్న ఇళ్ల నిర్మాణాల సంఖ్య 7,212. అయితే ఈ లెక్కల్లో వాస్తవమెంత అన్న అనుమానాలు లేకపోలేదు.

స్థాయి మారిందట

కూటమి పాలనలో 7,212 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్టు అంకెలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి దయనీయంగా కనిపిస్తోంది. అయితే ఈ 14 నెలల్లో ఇళ్ల నిర్మాణాల స్థాయి మారినట్టు అంకెలు చెబుతున్నాయి. ఒకదాని నుంచి ఇంకోదానికి స్థాయి మారడం తప్పితే పూర్తి చేయించిన ఇళ్ల సంఖ్యలో మార్పులేదు. బీఎల్ నుంచి ఎల్‌ఎల్‌కు, ఎల్‌ఎల్ నుంచి ఆర్‌ఎల్‌కు, ఆర్‌ఎల్ నుంచి ఆర్‌సికి, ఆర్‌సీ నుంచి పూర్తి కావడానికి సంబంధించి 15,529 ఇళ్ల స్థాయి మారిందని లెక్కలు వేశారు. ఈ మొత్తం నిర్మాణ పనులకు ఈనెల 14 నాటికి కూటమి ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.24 కోట్లే. దీన్నిబట్టి ఇళ్ల నిర్మాణాల పరిస్థితి ఏమిటో చెప్పకనే చెప్పవచ్చు.

పత్తాలేని ప్రత్యేకాధికారులు: జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించేందుకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి మండలాలు, పట్టణాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. వీరు గృహ నిర్మాణాలను పర్యవేక్షిస్తూ పనుల్లో వేగం పెంచేలా కృషి చేయాలి. సచివాలయ, గృహ నిర్మాణశాఖ అధికారుల మధ్య సమన్వయంతో చర్యలు తీసుకోవాలి. అయితే ప్రత్యేకాధికారులు మండలాల్లో పర్యటించి ఇళ్ల స్థితిగతులను పరిశీలించిన దాఖలాలు లేవు. కనీసం సమావేశాలు పెట్టి లబ్ధిదారుల్లో చైతన్యం కలిగించే చర్యలు శూన్యం. ఇలాంటి పరిస్థితుల్లో పేదల నిర్మాణాలను పూర్తి చేయించే చిత్తశుద్ధి కనిపించకుండాపోతోంది. ఫలితంగా ప్రత్యేకాధికారులు పేరుకు మాత్రంగానే మిగిలిపోతున్నారు.

2019-24లో ఇళ్ల నిర్మాణాలు

మంజూరైన పక్కా ఇళ్లు:	78,221
అప్పటికి పనులు చేపట్టనవి:	4,604
బీబీఎల్ స్థాయి:	9,998
బీఎల్ స్థాయి:	19,578
ఎల్‌ఎల్ స్థాయి:	986
ఆర్‌ఎల్ స్థాయి:	5,681
ఆర్‌సీ స్థాయి:	2,913
ఇళ్ల నిర్మాణం పూర్తి:	34,906
చెల్లించిన బిల్లు నిధులు:	రూ.826 కోట్లు



2024 జూన్ 4 నుంచి మారిన ఇళ్ల స్థాయి

బీబీఎల్ స్థాయి:	48
పీబీస్థాయి:	482
బీఎల్ స్థాయి:	552
ఎల్‌ఎల్ స్థాయి:	1,958
ఆర్‌ఎల్ స్థాయి:	1,917
ఆర్‌సీ స్థాయి:	3,360
ఇళ్ల నిర్మాణం పూర్తి:	7,212
చెల్లించిన బిల్లు నిధులు:	రూ.24 కోట్లు

వైఎస్సార్‌సీపీ పాలనలో..

జిల్లాలో లేఔట్లలో పేదలు గృహాలు నిర్మించుకోవాలంటే నీటికి ఇబ్బంది కలగకుండా రూ.31.34 కోట్లు కేటాయించగా అందులో పట్టణ లేఔట్లలో నీటి సరఫరా పనులు, బోర్లకు రూ.10.63 కోట్లు, గ్రామీణ ప్రాంత లేఔట్లలో నీటివసతి, బోర్లు, పైప్‌లైన్లకు రూ.20.71 కోట్లు కేటాయించి పనులు చేపట్టింది. లేఔట్లలో బోర్లు, పైప్‌లైన్, విద్యుత్ సరఫరా పనులు చేశారు. అలాగే నిర్మాణ పనులకు సౌలభ్యంగా సామగ్రిని తక్కువ ధరతో అందించింది. ఇంటి, కిటికీ తలుపులు, విద్యుత్ సరఫరా, నీటిపైప్‌లైన్ సామగ్రి, వాటర్ ట్యాంక్, ఇంటికి పూసే సున్నం తదితర వాటిని సరఫరా చేసింది. వీటిని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు వినియోగించుకుని పనులు వేగంగా పూర్తి చేసుకున్నారు. దీనికితోడు ప్రభుత్వం ఉచితంగా ఇంటి నిర్మాణానికి మంజూరు చేసిన రూ.1.80 లక్షలకు అదనంగా బ్యాంకులు, మహిళా సంఘాల నుంచి ఒక్కో లబ్ధిదారునికి రూ.35 వేల రుణ ం అందించారు.

బిల్లు ఇవ్వండి



మా తల్లి గంగులమ్మ పేరిట 2023లో జగన్న ఇల్లు మంజూరైంది. ఇంటినిర్మాణం చేపట్టేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో ఆలస్యంగా పనులు చేశాం. ఇంటి మోల్డింగ్ పనులు జరిగాయి. తర్వాత ఎన్నికలు రావడంతో కోడ్ అమలులో ఉందని బిల్లు ఇవ్వలేదు. పట్టా రద్దు చేస్తారని అప్పులు చేసి ఇంటి పనులు చేపట్టాం. అయినా బిల్లులు అందలేదు. ప్రభుత్వం స్పందించి నిర్మాణ బిల్లులు ఇస్తే పనులు పూర్తి చేసుకుంటాం. -శారద, లబ్ధిదారు గంగులమ్మ కుమార్తె, బండమీదపల్లె, నిమ్మనపల్లె

భారంగా మారింది



జగనన్నకాలనీలో పక్కా గృహం మంజూరైంది. కూలీ పనులు చేసుకుని జీవిస్తున్న తాము ఇబ్బందులతో పనులు మొదలు పెట్టగా మొదటి బిల్లు ఇచ్చారు. ఇప్పుడు గోడల నిర్మాణం చేపట్టాలంటే ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం ఇంటి నిర్మాణ సామగ్రిని సర ఫరా చేయాలి. ప్రభుత్వం సహకరిస్తే పెరిగిన ధరల భారం నుంచి ఊరట దక్కుతుంది. -బావాజాన్, పెద్దతిప్పసముద్రం

వైఎస్ జగన్ పర్యటన ఖరారు!

- 19న ఆకేపాడుకు రాక
- షెడ్యూల్ వివరాలు వెల్లడి



రాజంపేట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19న రాజంపేట మండలం ఆకేపాడు రానున్నారు. ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారు అయిందని రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి ఆదివారం విలేకర్లకు తెలిపారు.రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆకేపాటి సాయిఅనురాగ్‌రెడ్డి, వరదీక్షితా నవదంపతుల రిసెప్షన్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేసి, నవదంపతులను ఆయన ఆశీర్వదించనున్నారన్నారు. ఆకేపాటి ఎస్టేట్‌లో రిసెప్షన్ వేడుక జరగుతుందని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి రాజంపేటకు హెలీక్యాప్టర్‌లో వస్తారన్నారు. ఇందుకోస హెలీప్యాడ్ సిద్ధం చేస్తున్నామన్నారు. ఉదయం పది గంటలకు బయలుదేరుతారన్నారు. తిరిగి ఆకేపాడు ఎస్టేట్ నుంచి 12.35 గంటలకు బయలుదేరి బెంగళూరుకు వెళతారన్నారు. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న తరుణంలో భారీగా ప్రజలు వచ్చే అవకాశం ఉందని,, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆకేపాటి అనిల్‌రెడ్డి తెలిపారు.

పర్యటన వివరాలు..

ఉదయం 10గంటలకు బెంగళూరులోని యలహంక నుంచి బయలుదేరుతారు. రోడ్డుమార్గంలో 10.20కి చేరుకుంటారు, 10.30గంటలకు జక్కూరు ఎయిర్‌డ్రోమ్ నుంచి హెలీక్యాప్టర్‌లో బయలుదేరుతారు. 11.30గంటలకు ఆకేపాడులోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గంలో 11.40గంటలకు ఆకేపాటి ఎస్టేట్‌కు చేరుకుంటారు. 12 గంటల నుంచి 12.15 వరకు ఆకేపాటి ఎస్టేట్‌లో ఎమ్మెల్యే సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి తనయుడు రిసెప్షన్ వేడుకల్లో పాల్గొంటారు. 12.25కు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 12.35కు జక్కూరు ఎయిర్‌డ్రోమ్ బెంగళూరుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 1.40 గంటలకు బయలుదేరి 2గంటలకు యలహంకలోని రెసిడెన్సీకి చేరుకుంటారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పోరాడదాం

ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

ఒంటిమిట్ట: భవిష్యత్తులో రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పోరాడాలని ఒంటిమిట్ట జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..5 రోజుల క్రితం ఒంటిమిట్ట మండలంలో జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికలో నన్ను గెలిపించడం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరూ, భవిష్యత్తులో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇంత కంటే దీటుగా పోరాడి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలన్నారు. ఈ జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు, పచ్చ ముసుగు వేసుకుని విధులు నిర్వహించిన అధికార యంత్రాంగం అందరూ వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు లాగారన్నారు. నాయకులను, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేసి, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా దొంగ ఓట్లు వేసుకున్నారని ఆరోపించారు. మొదటి సారిగా ఒంటిమిట్ట మండలంలో హింసాత్మక వాతావరణం నెలకొన్న ఎన్నికలను మండల ప్రజలు చూశారన్నారు. ఈ హింసాత్మక ఎన్నికలతో ప్రజల్లో వైఎస్సార్‌సీపీపై సానుభూతి పెరిగి, వచ్చే ఏ ఎన్నికల్లోనైనా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కూండ్ల ఓబుల్ రెడ్డి, దున్నూతల లక్ష్మీనారాయణరెడ్డి, మేరువ శివనారాయణ, శేఖర్ రెడ్డి, రాజమోహన్ నాయుడు, రాజశేఖర్‌రాయల్, గురుమోహన్ రాజు, మనోహర్ రెడ్డి, వెంకట కృష్ణ రెడ్డి, గంగిరెడ్డి, రవిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, పాండురంగారెడ్డి, అబ్బిరెడ్డి, జాకీర్ హుసేన్, శేషారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

● కువైట్‌లో నాటుసారా మృతులు..

ఉమ్మడి కడప జిల్లాలో గుబులు



కువైట్ దేశం



కల్తీ మద్యం సేవించిన వారిని తరలిస్తున్న కువైట్ ఎమర్జెన్సీ మెడిసిన్ సర్వీసెస్ బృందం

- 23 మంది మృత్యువాత
- మృతుల్లో నలుగురు కడప వాసులు ఉన్నట్లు ప్రచారం

రాజంపేట: కువైట్‌లో చోటుచేసుకున్న కల్తీమద్యం/నాటుసారా దుర్ఘటనలు ఉమ్మడి కడప జిల్లాలోని గల్ఫ్ కుటుంబీకులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. అక్కడ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న క్రమంలో ఇక్కడి వారి కుటుంబాల్లో ఆందోళన కూడా పెరుగుతోంది. వీరిలో తెలుగు వారు ఉన్నారని, పైగా.. కడపకు చెందిన వారు నలుగురు ఉన్నారనే వార్తలు మరింత కలకలం రేపుతున్నాయి. వివరాలివీ..

● ఉమ్మడి కడప జిల్లాలోని కడప, రాజంపేట, రాయచోటి, బద్వేలు, రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలో అనేకమంది కువైట్‌లో వివిధ రకాల చిన్నాచితక పనులకు వెళ్లారు. ఇలా అప్పులు చేసుకు వెళ్లిన పేదవర్గాలను అక్కడి నాటుసారా తయారీ ముఠా సభ్యులు ఆకట్టుకుని, కొద్దికాలంలోనే అప్పులు తీర్చుకోవచ్చని ఆశచూపి, వారిని బరిలోకి దింపుతున్నారు. కువైట్‌లో మద్యం లభ్యంకాదు కాబట్టి అక్కడ అక్రమంగా నాటుసారాతో పాటు నకిలీ మద్యం వీరి ద్వారా విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. అహమది, ఫెహల్, మంగాఫ్ ప్రాంతాల్లోని ప్రైవేటు అపార్టుమెంట్‌లలో రహస్యంగా నాటుసారా తయారీ కేంద్రాలు ఉన్నాయని కువైట్ పోలీసులు గుర్తించి ఇటీవల వాటిపై దాడులు చేసి బట్టీలు ధ్వంసం చేశారు. నిర్వాహకులను అరెస్టుచేశారు. ఇలా అక్కడ నాటుసారా వ్యాపారం చేస్తున్న వారిలో రాజంపేట, రైల్వేకోడూరుకు చెందిన కొంతమంది ఉన్నారని తెలిసింది.

23 మంది మృతి..

మరోవైపు.. అక్కడ మిథనాల్-కలుషిత ఆల్కహాల్ సేవించి పలువురు మృత్యువాత పడిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ దుర్ఘటనలో 23 మంది మరణించారు. వీరిలో ఆసియా దేశాలకు చెందిన వారు ఉండటం గమనార్హం. తెలుగువారి వివరాలు అధికారికంగా వెలువడలేదు. కానీ, మృతుల్లో.. చికిత్స పొందుతున్న వారిలో ఉమ్మడి కడప జిల్లా వారున్నారని వస్తున్న వార్తలు ఇక్కడి వారి కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అక్కడ నాటుసారా తాగే వారిలో మనవారున్నారన్న ప్రచారం జరుగుతోంది. అలాగే, కల్తీ మద్యం బారినపడి కొంతమంది కంటిచూపు కోల్పోయారని.. మరికొందరు పక్షవాతానికి గురైయ్యారని.. ఇంకొందరి కిడ్నీలు పాడైనట్లు వస్తున్న వార్తలు వీరిని మరింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి.

హోదా మరిచారు!

అధికారిక సమీక్షలో సైతం పచ్చ నేతలకు పెద్ద పీట వేస్తుంటే.. విధులు పక్కనబెట్టి 'నిధుల' కోసం పాకులాడుతుంటే.. ఇక 'హోదా' ఏముంటుంది..

నేతలు చెప్పినదానికల్లా తలాడిస్తుంటే... నిత్యం వారి చెప్పుచేతల్లో బందీలయితే.. 'కుర్చీ'ల రగడే జరుగుతుంది..

ప్రజాప్రతినిధులా 'బాధ్యత' లేకుండా ప్రవర్తిస్తున్నారు.. అధికారులా విధి నిర్వహణను మానేశారు.. 'ఇద్దరూ' కలిసి హోదాని.. హుందాతనాన్ని గోదాట్లో కలిపారు..

- రెవెన్యూ తీరు వల్లే కడప ఎమ్మెల్యే కుర్చీ రగడ



ఎమ్మెల్యే మాధవిరెడ్డిని ఆహ్వానిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్: పంద్రాగస్టు రోజు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, జిల్లా అధికారుల మధ్య తలెత్తిన వివాదం ఇంకా సమసిపోలేదు. ఇరువర్గాలు పరస్పరం విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ ఈ అంశాన్ని ప్రభుత్వానికి నివేదించాలని రెవెన్యూ అధికారులు పట్టుబడుతున్నారు. ఈ మొత్తం వివాదానికి కారణమైన ప్రొటోకాల్ అంశం మరోమారు చర్చనీయాంశంగా మారింది. ఎలాంటి ప్రొటోకాల్ లేని టీడీపీ నేతలకు ప్రభుత్వ కార్యక్రమాలు, జిల్లా సమీక్షా కమిటీ లాంటి ముఖ్యమైన సమావేశాల్లో పెద్దపీట వేస్తూ వస్తున్నారు.

ఎమ్మెల్యే భర్త ప్రభుత్వ హోదానా!

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డికి ఎటువంటి ప్రభుత్వ హోదా లేదు. ఆయనేం ప్రజాప్రతినిధి కాదు. అయినా 'ఎమ్మెల్యే భర్త'గా డీఆర్సీ సహా ప్రతి ప్రభుత్వ కార్యక్రమాల్లో వేదికపై దర్శనమిస్తుంటారు. అంతటితో ఆగకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తుంటారు. ప్రభుత్వ వేదికల నుంచి రాజకీయ విమర్శలు గుప్పించినా కలెక్టర్ సహా ఏ అధికారి అడ్డు చెప్పలేదు. పలుమార్లు ఈ విషయాలు పత్రికల్లో ప్రచురితమైనా అధికారులు స్పందించలేదు. ఇప్పుడు తమవంతు వచ్చేసరికి ప్రొటోకాల్ గురించి మాట్లాడితే దాని విలువ ఏముంటుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి ప్రస్తావన

ఎద్దుల ఈశ్వర్ రెడ్డి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఓమారు ఎమ్మెల్సీగా, నాలుగు పర్యాయాలు కడప లోక్‌సభ సభ్యునిగా ప్రజలకు విశేష సేవలు అందించిన కమ్యూనిస్టు నాయకుడు. ఆయన ఎంపీగా ఉన్నప్పుడు ఏదైనా ప్రజా సమస్యలపై కలెక్టర్ వద్దకు వచ్చినపుడు తొలుత చీటీ రాసి పంపించేవారట. 'నేరుగా వెళ్లండి సార్...' అంటూ అధికారులు చెప్పినా సున్నితంగా తిరస్కరించేవారు. కలెక్టర్ అనుమతి వచ్చాకే చాంబర్‌లోకి వెళ్లి సమస్యను విన్నవించేవారు. ఆయన హుందాతనం గురించి ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఉద్యోగులు, నగర పౌరులు చర్చించుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు తొలుత ప్రొటోకాల్ క్రమాన్ని తెలుసుకుని హుందాగా ప్రవర్తిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మట్టితో మనుగడ.. మార్పుతో కదలిరా..

పర్యావరణ హిత ప్రతిమల వైపు దృష్టి అవశ్యం

మదనపల్లె సిటీ : వినాయకచవితి వచ్చేస్తోంది. నవరాత్రులు అధ్యాత్మిక వైభవాన్ని చాటుతాయి. అయితే అత్యధికులు పర్యావరణ హితాన్ని విస్మరిస్తున్నారు. పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) ప్రతిమలనే ప్రతిష్ఠిస్తున్నారు. కొందరు మాత్రం ప్రకృతి ప్రేమికులుగా ప్రత్యేకత చాటుతున్నారు. మట్టి, చింతపిక్కల పొడి, గోమయం, ప్రతిమలు రూపొందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నెల 27న వినాయచవితిని పురస్కరించుకుని ఇటు వైపు అడుగేయాల్సిన ఆవశ్యకత ఉంది.

తొలి పూజ అందుకునే గణేశుడిని మట్టితో తీర్చిదిద్దినా. ఏ ఆకృతిలో కొలిచినా ఆలకిస్తారని గుర్తించాలి. జిల్లాలో సుమారు నాలుగు వేలకుపైగా మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు అంచనా. వీటిలో అతి తక్కువగా పర్యావరణహి హితమైనవే ఉంటున్నాయి. చిన్న మట్టి ప్రతిమలను ఇంటింటా స్వచ్ఛందంగా పంపిణీ చేస్తున్నారు.

పీవీపీతో నష్టాలు తెలుసుకో..

పీవోపీ ప్రతిమలు నీటిలో కరగవు. ముడిపదార్థాలు, రంగుల్లో వాడే రసాయనాలు ముప్పుగా మారుతాయి. నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గుతుంది. చేపలు, ఇతర జలచరాలు హాని కలిగిస్తాయి. మానవ నాడీ వ్యవస్థ, ఊపరితిత్తులు, కిడ్నీలపై దుష్ప్రభావాన్ని చూపుతాయి. చర్మవ్యాధులు, ప్రమాదకర క్యాన్సర్లకు దారి తీస్తుంది. కృత్రిమ రంగులతో బురదలో మేలు చేసే క్రిములు చనిపోతాయి.

ముందు నుంచే కార్యాచరణ

ప్రభుత్వాలు, కాలుష్య నియంత్రణ మండలి ముందు నుంచి ప్రేరణ కల్పించాలి. మట్టిప్రతిమల తయారీదారులను ప్రోత్సహించాలి. విస్తృతంగా అవగాహన సదస్సులు,సమావేశాలు నిర్వహించి చైతన్యం తేవాలి. పెద్ద విగ్రహాల తయారీకి తర్ఫీదు ఇవ్వాలి.



మదనపల్లె సమీపంలో మట్టితో తయారు చేస్తున్న వినాయకుని విగ్రహాలు

పదేళ్లుగా మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ

మదనపల్లె పట్టణానికి చెందిన హెల్పింగ్ మైండ్స్ సంస్థ 2016 నుంచి ప్రతి ఏటా మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా పండుగకు ముందుగానే పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో స్టాళ్లను ఏర్పాటు చేస్తారు. అందరికీ ఉచితంగా వినాయకుని ప్రతిమలతో పాటు వివిధరకాల మొక్కలు అందించి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వల్ల జరిగే పర్యావరణ కాలుష్యం గురించి అవగాహన కల్పిస్తున్నారు.

సేదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

మదనపల్లెకు చెందిన సేదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పఠాన్ ఖాదర్‌ఖాన్ ఏటా వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుని ప్రతిమలు ఉచితంగా అందిస్తున్నారు. ప్రతిమలతో పాటు పూజాసామగ్రి(పత్రి) కూడా అందిస్తున్నారు. మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమల వల్ల పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని అవగాహన కల్పిస్తున్నారు. అదే సమయంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన ప్రతిమల వలన జరుగు అనర్థాలు , పర్యావరణ కాలుష్యం గురించి వివరిస్తున్నారు. అలాగే పట్టణంలోని సుబ్బారెడ్డి లేఅవుట్‌కు చెందిన శ్రీ సత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయకుని ప్రతిమలను అందిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఏటా వినాయక చవితి సందర్భంగా మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమలను ప్రజలకు అందిస్తున్నాం. ప్లాస్టర్‌ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసే వినాయకుని విగ్రహాలు, ప్రతిమలు హానికరమైన రసాయనాలు కలిగి ఉండటం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. పండుగ సందర్భంగా ప్రతిమలతో పాటు వివిధ రకాల మొక్కలను కూడా పంపిణీ చేస్తున్నాం.

– అబూబకర్ సిద్దీఖ్, హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు, మదనపల్లె

సంకల్పంతో సాధ్యమే



పర్యావరణ హితమైన మట్టి ప్రతిమల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సంకల్పించుకోవాలి. నేల,నీటి కాలుష్యానికి కారణమయ్యే ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాలి.

– మోహన్‌వల్లి, అధ్యాపకులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, మదనపల్లె

దివ్యాంగులకు అన్యాయం

ప్రొద్దుటూరు రూరల్ : నిజమైన దివ్యాంగులకు రీ వెరిఫికేషన్ పేరుతో సదరం సర్టిఫికెట్ల మంజూరులో అన్యాయం చేస్తున్నారని దివ్యాంగుడు దొడియం అఫ్జల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తనకు చిన్నతనంలోనే పోలియో సోకి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయన్నారు. గతంలో మెడికల్ సర్టిఫికెట్‌లో తనకు 90 శాతం వికలత్వం ఉందని ఇచ్చారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేసిన రీవెరిఫికేషన్ సర్టిఫికెట్‌లో తనకు కేవలం 64 శాతం వికలత్వం ఉందని ఇచ్చారన్నారు. తన ఫొటోకు బదులు అమ్మాయి ఫొటోను తప్పుగా నమోదు చేశారన్నారు.

వైద్య ప్రముఖుడు డాక్టర్ వైబీ రెడ్డి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర ప్రముఖుడు, హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందని డాక్టర్ వైబీ రెడ్డి బెంగళూరులో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. వైబీ రెడ్డి వైద్య విద్యను పూర్తి చేసి కడపలోని ఏడురోడ్లలో దాదాపు 15 సంవత్సరాలు ప్రజలకు వైద్య సేవలు అందించారు. అనంతరం గ్రానైట్ మైన్ ఓనర్‌గా విశేష ఖ్యాతి ఆర్జించగా, ఫాదర్ ఆఫ్ కడప మార్బుల్స్ అని బిరుదును దక్కించుకున్నారు. సిద్దవటం మండలం భాకరాపేటకు చెందిన ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు ఉన్నారు. పెద్ద కుమార్తె కుటుంబం అమెరికాలో ఉద్యోగరీత్యా స్థిరపడ్డారు. చిన్న కుమార్తె కుటుంబం బెంగళూరులో ఉంటున్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ

మదనపల్లె రూరల్ : పశ్చిమబెంగాల్‌వాసి అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు రైల్వే సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం పశ్చిమబెంగాల్‌వాసి ఖదీర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఉపాధికోసం పశ్చిమబెంగాల్ ముర్షీదాబాద్ ఇమామ్‌నగర్‌కు చెందిన ఎస్.కే.మైముల్ కుమారుడు ఎస్.కే.ఖదీర్(30) మదనపల్లెకు వచ్చి రోడ్డు, భవననిర్మాణ పనులు చేస్తూ కురబలకోట మండలం రైల్వే బ్రిడ్జి సమీపంలో షెడ్ నిర్మించుకుని మరో ఇద్దరితో కలిసి ఉంటున్నాడు. నెలరోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లి తిరిగి వచ్చాడు. ఈనెల 15 శుక్రవారం తనకు పరిచయస్తుడైన ఆటోడ్రైవర్‌తో కలిసి ఇంటి నుంచి వెళ్లాడు. శనివారం మదనపల్లె మండలం సీటీఎం రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో శవమై కనిపించాడు. ఆటోడ్రైవర్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. అన్ని కోణాల్లోనూ కేసు విచారిస్తున్నామన్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మృతికి గల కారణాలు తెలుస్తాయన్నారు.

రూ. 85 వేలు పలికిన గణేష్ లడ్డూ



గణేష్ లడ్డూ దక్కించుకున్న శ్రీ సాయి వీజీపీ పెయింట్స్ యజమానులు

పీలేరురూరల్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ప్రియదర్శిని కళాశాలలో గణేష్ లడ్డూకు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గణేష్ సెంటర్ల నుంచి పోటీ పడి హెచ్చుపాట ద్వారా శ్రీ సాయి వీజీపీ పెయింట్స్ అండ్ ఎలక్ట్రికల్స్ యజమానులు పురుషోత్తంరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, రెడ్డి శేఖర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి మిత్ర బృందం గణేష్ లడ్డూను రూ. 85 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మోహన్‌రెడ్డి, శ్రీధర్, రమణ, సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, దినకర్, నవీన్‌కుమార్, కృపాల్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 27న గణేష్ విగ్రహాలు నెలకొల్పి అనంతరం 31న ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సౌదీ అరేబియాలో కుమార్లకాల్వ వాసి మృతి



షేక్ నూర్‌బాషా(ఫైల్)

చక్రాయపేట : జీవనోపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లిన చక్రాయపేట మండలం కుమార్లకాల్వకు చెందిన షేక్ నూర్‌బాషా(38) మృతి చెందాడు. ఆదివారం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12–30 గంటలకు మృతి చెందినట్లు అక్కడ ఉన్న అతని మిత్రులు కుటుంబీకులకు సమాచారం అందించారు. ఇందుకు సంబంధించి నూర్‌బాషా బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇతను బతుకు దెరువు నిమిత్తం 15 సంవత్సరాల క్రితం సౌదీ అరేబియాలోని దమామ్‌కు వెళ్లాడు. ఐదు నెలల క్రితం సెలవుపై స్వగ్రామానికి వచ్చి భార్యా బిడ్డలు, బంధుమిత్రులతో హాయిగా గడిపి తిరిగి దమామ్ వెళ్లాడు. ఆదివారం విధులకు హాజరయ్యేందుకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్ రూమ్‌లోకి వెళ్లి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. బాత్‌రూం నుంచి ఎంత సేపటికి రాకపోవడంతో మిత్రులు వెళ్లి చూడగా కిందపడి మృతిచెంది ఉన్నాడు. ఈ విషయాన్ని నూర్‌బాషా మిత్రులు కుమార్లకాల్వలోని కుటుంబీకులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. విషయం తెలియగానే వారు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య గౌసియా, ఆర్షియా, రియాజ్, రిజ్వాన్ అనే 10 సంవత్సరాల లోపు పిల్లలు, వృద్ధురాలైన తల్లి ఉన్నారు.

మహిళల ఉచిత ప్రయాణానికి 8400 బస్సులు

ఆర్టీసీ ఈడీ టి. చెంగల్‌రెడ్డి

పీలేరురూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా 129 డిపోలలో స్త్రీ శక్తి పథకంలో భాగంగా 8400 బస్సు సర్వీసులు మహిళ ఉచిత ప్రయాణానికి నడుపుతున్నట్లు విజయవాడ ఆర్టీసీ మెకానికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి. చెంగల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా పీలేరులోని ఆర్టీసీ గ్యారేజ్‌లో బస్సుల కండీషన్‌ను పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నరు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

ఈ కార్యక్రమంలో డీఎం బి. నిర్మల, సీఐ ధనుంజయలు, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్, రెడ్డెప్ప, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోళ్లబైలులో ఆక్రమణల తొలగింపు

ఇంటి పట్టాలపై తహసీల్దార్ విచారణ

సాక్షి ఎఫెక్ట్..

మదనపల్లె రూరల్ : కోళ్లబైలులో కబ్జాల జోరు శీర్షికన సాక్షిలో ప్రచురితమైన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. కోళ్లబైలు పంచాయతీ శేషాచలనగర్‌లో అక్రమంగా వేసిన పునాదులు, నిర్మాణాలను కూల్చివేశారు. స్థానికంగా ఇంటి నిర్మాణాలు జరుపుతున్న వారిని తమ పట్టాలు తీసుకుని ఆదివారం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని ఆదేశించారు. దీంతో సుమారు 15మందికి పైగా తమ పట్టాలను తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. 2008లో చేనేత కార్మికులమైన తమకు రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేశారని, అయితే..అధికారులు కేటాయించిన స్థలం కొండలు, గుట్టలు కావడంతో ఆర్థిక ఇబ్బందులతో ఇళ్ల నిర్మాణం చేపట్టలేకపోయామన్నారు. ప్రస్తుతం నిర్మాణాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి లబ్దిదారుల నుంచి పట్టాలు, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు తీసుకున్నారు. రెవెన్యూ సిబ్బందితో పట్టాలు, లబ్ధిదారుల అర్హతను పరిశీలిస్తామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులై ఉంటే, తదుపరి నిర్ణయం తెలుపుతామన్నారు. అప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని వారికి సూచించారు.



కోళ్లబైలులో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇంటిలో చోరీ

రూ. 3 లక్షల నగదు, 12 తులాల బంగారు నగల అపహరణ

గాలివీడు : మండల కేంద్రమైన గాలివీడులోని గౌతమ్ స్కూలు సమీపంలో శనివారం రాత్రి ఓ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు బీగాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఆటో డ్రైవర్ ఎం.మల్లయ్య శనివారం తన అత్తగారింటికి వెళ్లడంతో గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి అల్మారాలో ఉన్న రూ. 3 లక్షల నగదు, 12 తులాల బంగారు నగలను అపహరించినట్లు బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. దొంగతనం చేసిన నగదు, బంగారు ఆభరణాల రశీదుల వివరాలను స్టేషన్‌లో సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల ప్రజలు ఊర్లకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులు ఇళ్లలో పెట్టరాదని, బ్యాంకు లాకర్‌లో భద్ర పరుచుకోవాలన్నారు. అలాగే ఊర్లకు వెళ్లే సమయంలో సమాచారం పోలీసు స్టేషన్‌లో తెలియజేస్తే ఆ ఇంటిపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ప్రస్తుతం జరిగిన సంఘటనపై పూర్తి విచారణ జరిపి కేసు నమోదు చేస్తామన్నారు.



అల్మారాలోని నగదు, బంగారు నగలు అపహరించాక తెరిచి ఉన్న దృశ్యం

రామాలయంలో చోరీ

మండల పరిధిలోని నూలివీడు గ్రామం బోడసాని వాండ్లపల్లెలో నూతనంగా ప్రారంభించిన రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ. 50 వేలు విలువ కలిగిన వెండి ఆభరణాలను దొంగిలించారు. స్థానికులు ఆదివారం ఆలయానికి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పూర్వ విద్యార్థుల కలయిక



తంబళ్లపల్లె : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1974–75 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు 50 ఏళ్ల తరువాత కలుసుకోవడం విశేషం. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. నాటి విద్యార్థులు సుమారు 34 మంది హాజరయ్యారు. అందరూ ఒకరినొకరు పలకరించుకుంటూ గత స్మృతులు నెమరువేసుకున్నారు. నాటి గురువులను స్మరించుకున్నారు. మృతి చెందిన గురువులు, సహచర విద్యార్థుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం వహించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డు జిల్లా జడ్జి క్రిష్ణప్ప, ఆడిటర్ చంద్ర, మల్లికార్జున గ్రూపు థియేటర్ యజమాని కుళాయిరెడ్డి, మెడికల్‌షాపు సుధాకర్, మానవత సంస్థ నారాయణరెడ్డి, శంకర్, నలంద రామచంద్రారెడ్డి, క్రిష్ణారెడ్డి, పీజె వెంకటరమణారెడ్డి, పోస్టు రామచంద్రారెడ్డి, దీనదయాల్, గంగుల్‌రెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3కోట్ల విలువైన స్థలం ఆక్రమణకు యత్నం

- కమ్యూనిటీ పర్పస్ స్థలంలో కంచె నిర్మాణం
- అడ్డుకున్న స్థానికులు, పంచాయతీ సిబ్బంది

మదనపల్లె రూరల్ : మదనపల్లె–తిరుపతి మెయిన్‌రోడ్డుకు ఆనుకుని తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్ రోడ్‌నెం.4లో రూ.3 కోట్ల విలువైన పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ఆదివారం కొందరు వ్యక్తులు ప్రయత్నం చేశారు. జేసీబీతో స్థలాన్ని చదును చేసి చుట్టూ కంచె వేసేందుకు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు, పంచాయతీ సిబ్బంది అక్కడకు చేరుకుని ఆక్రమణ యత్నాన్ని అడ్డుకున్నారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ రవి మాట్లాడుతూ.. బసినికొండ రెవెన్యూ గ్రామం సర్వేనెం.88, 89, 91లో 23 ఎకరాల 69 సెంట్లు భూమిని దేవతానగర్ పేరుతో లేఔట్ వేసి విక్రయించారన్నారు. లేఔట్‌కు సంబంధించి కమ్యూనిటీ పర్పస్ కోసం కొంత స్థలాన్ని పంచాయతీకి రాసివ్వడం జరిగిందన్నారు. కొంతకాలం తర్వాత కమ్యూనిటీ పర్పస్ స్థలంలో నిర్మాణాలు, ఆక్రమణకు ప్రయత్నాలు చేస్తుండటంతో కోర్టుకు వెళ్లినట్లు చెప్పారు. అప్పటి నుంచీ ఇప్పటివరకు స్థలం ఖాళీగానే ఉందని, అయితే ఆదివారం ఉదయం స్థలాన్ని చదునుచేసి కంచె వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు తెలపడంతో అడ్డుకున్నామన్నారు. డీఎల్‌పీఓ, ఎంపీడీఓకు సమాచారం తెలిపామని, కోర్టుకు సంబంధించిన ఆర్డర్‌ను వారికి చూపించి వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని ఆక్రమణదారులకు సూచించారు. ఆక్రమణకు యత్నించిన దేవతా మురళీకృష్ణ మాట్లాడుతూ...దేవతానగర్ లేఔట్ స్థలం మొత్తం తమ కుటుంబానికి చెందిందని, అప్పట్లో పంచాయతీ అధికారులకు స్థలం రాసిఇస్తే వారు తీసుకోలేదన్నారు. తర్వాత స్థలాన్ని తాము ఇతరులకు అమ్మివేసినట్లు చెప్పారు.దీనిపై కొంత వివాదం జరగడంతో 2011లో కోర్టుకు వెళ్లామన్నారు. 14 ఏళ్ల తర్వాత 2025 జూలై 29న కేసు కొట్టివేస్తూ తీర్పు రావడంతో తమ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. అయితే వివాదాస్పద స్థలంలోకి అనుమతి లేకుండా ప్రవేశించడం, చీటింగ్‌కు సంబంధించి పోలీసులు నమోదుచేసిన క్రిమినల్ కేసును మాత్రమే కొట్టివేయడం జరిగిందని, స్థలంకు సంబంధించి కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొనలేదని పంచాయతీ సెక్రటరీ రవి తెలిపారు. పంచాయతీకి కేటాయించిన స్థలం మెయిన్‌రోడ్‌కు ఆనుకుని ఉండటం, బహిరంగ మార్కెట్లో రూ.3 కోట్లకు పైగానే ధర పలుకుతుండటంతో ఆక్రమణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, జిల్లా పంచాయతీ అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని తట్టివారిపల్లె మాజీ సర్పంచ్, ఎంపీటీసీ తట్టి శారదమ్మ, నాగరాజరెడ్డి, స్థానికులు కోరారు.



తట్టివారిపల్లె దేవతానగర్ రోడ్‌నెం.4కు ఆనుకుని పంచాయతీ స్థలాన్ని చదునుచేస్తున్న దృశ్యం

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబసమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. గొల్లపల్లెకు చెందిన నరసింహులు భార్య అమ్ములు(40) భర్తతో గొడవపడింది. మనస్తాపం చెంది ఇంటి వద్దే మాత్రలు మింగింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసపోతున్న యువత

కడప అర్బన్ : మయన్మార్‌లో ఉద్యోగాల పేరుతో కడప వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను ఇప్పిస్తామని కొందరు ఏజెంట్ల ద్వారా ఆకర్షింపచేశారు. వారిని తమ ఫేక్ కంపెనీలో కాల్‌సెంటర్ నుంచి మహిళల వాయిస్‌తో వినియోగదారులతో మాట్లాడించి వారి వలలో పడేలా చేసుకుంటారు. ఈ విధంగా మోసం చేసేందుకు అక్కడికి వచ్చిన యువతను ఉపయోగిస్తుంటారు. సైబర్ నేరాలకు మయన్మార్ అడ్డాగా మారింది. వీరితో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ యాప్‌తో వాట్సప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగామ్, స్నాప్‌చాట్‌ల ద్వారా లింకులు పంపిస్తారు. మన అకౌంటులోని డబ్బులు లాగేస్తారు. ఇలాంటి బాధితులు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది ఉన్నట్లు సమాచారం. కడపకు చెందిన సునీల్ అనే యువకుడు తెలంగాణకు చెందిన రాజశేఖర్ కలిసి డేటా ఎంట్రీ ఆపరేటరు ఉద్యోగం పేరుతో లక్ష రూపాయలు జీతం వస్తుందనే ఆశతో థాయిలాండ్ వెళ్లి, అక్కడ నుండి మయన్మార్ దేశానికి వెళ్లాడు. అక్కడ ఓ కార్యాలయంలో వీరిని పెట్టి, రకరకాల దేశాల్లో ఉన్న తెలుగు వారికి వీరి ద్వారా మెసేజ్‌లు పెట్టిస్తారు. వారి వద్ద ఉన్న అకౌంట్ల ద్వారా డబ్బులు వేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే కొంత మంది ఈ స్కాం నిరాకరించడంతో ఆ దేశస్తులు వీరిని చిత్రహింసలకు గురి చేస్తున్నట్లు బాధితుడు సునీల్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను అనుభవిస్తున్న వేధింపులు కుటుంబ సభ్యులకు చెప్పడంతో దాదాపు రూ.7లక్షల వరకు వారికి చెల్లించడంతో స్వగ్రామం కడపకు వచ్చి తన అనుభవాన్ని వెల్లడించాడు. బాధిత కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఈ ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వారి ద్వారా ఈ ముఠాను గుర్తించే అవకాశం ఉంటుంది. ఈ విషయంపై సైబర్ పోలీసులను వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, తమ దృష్టికి వస్తే కచ్చితంగా బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన నజీర్‌ఖాన్, అమరనాథ్

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించిన ఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం పంచాయతీ నేతాజీకాలనీకి చెందిన నజీర్‌ఖాన్ (40) రైల్వేక్వార్టర్స్‌కు చెందిన అమరనాథ్ (38) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చారు. తిరిగి రాత్రి సీటీఎంకు వెళుతుండగా మార్గమధ్యలో శానిటోరియం వద్ద వేగంగా వెళ్లి ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొని, పక్కనే వస్తున్న కారుపై పడ్డారు. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితులను తిరుపతికి రెఫర్ చేశారు.

శ్రమదానం చేశారు.. చెరువు కట్టను బాగు చేసుకున్నారు

సుండుపల్లె : మండల పరిధిలోని సుండుపల్లె–2 గ్రామ పంచాయతీలోని రాతిచెరువు ఇటీవల కురిసిన వర్షాలకు మొరవ దగ్గర తెగిపోయే స్థితిలో ఉంది. ఈ చెరువు మొరవ తెగిపోతే 3 గ్రామాల వ్యవసాయ పొలాలకు, గ్రామాలలోకి చెరువునీరు చేరుతుందని గ్రామస్తులు అధికారులకు పలుమార్లు తెలియజేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే చందాలు రాబట్టుకొని చెరువుకట్టకు మరమ్మతు పనులు నిర్వహించి బాగు చేసుకున్నారు.



చెరువుకట్ట మొరవ పనులలో రైతన్నలు

విష జ్వరంతో విద్యార్థి మృతి



రఘువరన్ (ఫైల్)

వేంపల్లె : వేంపల్లె పట్టణం శ్రీరాం నగర్ వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి బింగి రఘువరన్ ఆదివారం సాయంత్రం విష జ్వరంతో మృతి చెందాడు. కళాశాల రోడ్డులోని శ్రీరామ్‌నగర్‌లో నివాసముంటున్న బింగి ఓబులేసు, భారతిలకు ఇద్దరు పిల్లలు ఉండగా, రఘువరన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం విద్యార్థికి జ్వరం రావడంతో వేంపల్లెలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చూపించినట్లు తండ్రి ఓబులేసు తెలిపారు. రఘువరన్‌కు జ్వరం తగ్గకపోవడంతో కడప రిమ్స్‌కు తరలించి చికిత్స చేసి మెదడుకు జ్వరం సోకినట్లు వైద్యులు చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్, రుయాకు తీసుకెళ్లారు. అయితే స్విమ్స్, రుయాలో బెడ్లు లేకపోవడంతో తిరిగి కడప రిమ్స్‌కు తీసుకొచ్చి రఘువరన్‌కు చికిత్స చేయించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీరామ్‌నగర్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కేశలింగాయపల్లెకు సమీపంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా తవ్విన కల్వర్టు గుంతలో పడి స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన గుగ్గిళ్ల జగదీష్ (18) అనే యువకుడు మృతి చెందాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఈ సంఘటన గురించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీకి చెందిన ఏడుగురు 20 ఏళ్లలోపు యువకులు మండలంలోని గంజికుంటలో ఓ వివాహ వేడుక సందర్భంగా డీజే ఏర్పాటు చేసినట్లు తెలుసుకున్నారు. శనివారం రాత్రి కాలనీ నుంచి రెండ బైకుల్లో గంజికుంటకు వెళ్లారు. రాత్రి 12 గంటల తర్వాత గంజికుంట నుంచి వారు తిరిగి వస్తుండగా కేశలింగాయపల్లె సమీపంలో మైదుకూరు – తాడిచర్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తవ్విన కల్వర్టు గుంతలో నలుగురు ప్రయాణిస్తున్న బైక్ పడిపోయింది. బైక్‌పై ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలు కాగా జగదీష్ తలకు తీవ్ర గాయమైంది. అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.



మృతి చెందిన జగదీష్